సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



అపురూపమమ్మ

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవ రాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.


8లో



చాకులతో నలుగురిపై దాడి

బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.

2.28 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2.28.353 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12.700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

జిల్లా పీఆర్ ఇంజినీరింగ్ అధికారిగా రామకృష్ణారెడ్డి



జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణారెడ్డి

అమలాపురం టౌన్: జిల్లా పంచాయతీ రాజ్ (పీఆర్) ఇంజినీరింగ్ అధికారిగా పి.రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. కర్నూలు పీఆర్ డివిజన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన అమలాపురంలోని పీఆర్ జిల్లా కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన కె.చంటిబాబు ఉద్యోగ విరమణ పొందారు. ఖాళీ అయిన ఈ పోస్టులో రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం పీఆర్ సబ్ డివిజన్ డీఈఈలు అన్యం రాంబాబు, పీఎస్ రాజకుమార్‌ల ఆధ్వర్యంలో కార్యాలయ ఇంజినీర్లు, సిబ్బంది రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురంలోని కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ మహేష్‌కుమార్‌ను రామకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



వాడపల్లి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించగా, రూ.1,08,89,635 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు. 35 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.90,26,494, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.18,63,141 వచ్చిందన్నారు. అలాగే విదేశీ కరెన్సీ కూడా సమకూరిందన్నారు. బంగారం 19 గ్రాములు, వెండి 735 వచ్చిందని వివరించారు. శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీలను లెక్కించగా, రూ.2,36,510 ఆదాయం సమకూరిందన్నారు. రాజమహేంద్రవరం తనిఖీ అధికారి టీవీఎస్ ప్రసాద్, రాజోలు గ్రూప్ టెంపుల్స్ ఈఓ ఎన్‌వీఎస్‌ఎస్‌వీ ప్రసాద్‌రాజు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సై రాము పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఊడిన బస్సు టైరు
వృద్ధుడికి తీవ్ర గాయాలు



ఊడిపోయిన ఆర్టీసీ బస్సు టైరును బిగిస్తున్న మెకానిక్‌లు

తాళ్లరేవు: జార్జిపేట నీలాద్రిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి వెళ్తున్న బస్సు వెనుక టైరు ఊడిపోవడంతో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అమలాపురం నుంచి విశాఖపట్నం మద్దిలపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక టైరు ఒక్కసారిగా ఊడిపోయింది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉన్న జార్జిపేట గ్రామానికి చెందిన వృద్ధుడు ముద్రే గాంధీకి టైరు వేగంగా వచ్చి తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బస్సు డ్రైవర్ హుటాహుటిన అతన్ని యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అయితే శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యుడు దడాల జగదీశ్వరరావు తెలిపారు. సైకిల్‌పై తిరుగుతూ దుస్తుల వ్యాపారం చేసుకునే గాంధీ గాయాల పాలవ్వడంతో కుటుంబ పోషణ ఎలా అంటూ కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్తపేట ఆర్డీఓగా శ్రీకర్



కొత్తపేట: కొత్తపేట ఆర్డీఓగా పి.శ్రీకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా గుంటూరు ఆర్డీఓగా పనిచేస్తూ ఆయన ఇక్కడికి వచ్చారు.


కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: దసరా వేడుకల తొలి రోజు గురువారం రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రారంభమవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి వ్రతాలాచరించారు.

ఫుల్‌గా తాగించేందుకు..

- జిల్లాలో మద్యం షాపులకు భారీగా ఎక్సైజ్ ట్యాక్స్
- చెప్పింది ఒకటి... నిర్ణయం మరొకటి
- ఆదాయం పెంచుకునేందుకు ఇదో మార్గం
- మద్యం షాపులను దక్కించుకునేందుకు సిండికేట్
- ఎమ్మార్పీ కన్నా అధికంగా విక్రయించేందుకు సిద్ధం





సాక్షి, అమలాపురం: చంద్రబాబు మార్క్ సంపద సృష్టిలో మద్యం కూడా ఒక భాగం కానుంది.. కూటమి ప్రభుత్వ మద్యం పాలసీలో చెప్పేదొకటి చేస్తున్నదొకటి అయ్యింది. జిల్లాలో మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, పంచాయతీల్లో జనాభాను బట్టి మద్యం షాపులకు ఎక్సైజ్ ట్యాక్స్ నిర్ణయిస్తామని చెప్పిన ప్రభుత్వం తీరా అమలుకు వచ్చేసరికి అన్నిచోట్లా ఒకే విధానాన్ని తీసుకువచ్చింది. తద్వారా ఆదాయం పెంచుకునేందుకు రంగం సిద్ధం చేసింది.

కొత్త మద్యం పాలసీ అమలులోకి వస్తోంది. నాణ్యమైన మద్యం తక్కువ ధరలకు అందిస్తామని ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు ఊదరగొట్టారు. కానీ కొత్త పాలసీ అమలు జరిగే తీరును విశ్లేషిస్తే సామాన్యులతో అధికంగా తగించి ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలన్నట్టు ఉంది. జిల్లాకు 133 మద్యం షాపులు కేటాయించారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు 22 మండలాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. మద్యం దుకాణాలను పొందేందుకు లాటరీ విధానాన్ని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం ఇందుకు రూ.రెండు లక్షల ధరావత్తు నిర్ణయించింది. లాటరీలో దుకాణం దక్కకున్నా ఈ సొమ్ములు తిరిగి ఇవ్వరు. గత టీడీపీ పాలనలో చెలరేగిపోయిన మద్యం మాఫీయాకు అధికంగా దుకాణాలు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం ధరావత్తు భారీగా నిర్ణయించింది. దీనివల్ల కొత్తవారు లాటరీలో పాల్గొనే అవకాశం ఉండదని వారి అంచనా. పాతవారికి దుకాణాలు అధికంగా వస్తే సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేసే వీలు కలుగుతోంది.

భారీగా లైసెన్స్ ఫీజు

పట్టణాలు, నగర పంచాయతీలు, మండల కేంద్రాలు, పంచాయతీల్లో జనాభాను బట్టి లైసెన్స్ ఫీజు స్లాబ్ ఉంటోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తొలుత ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విధానాన్ని 2014–19లో అవలంబించారు. ఇందులో భాగంగా తొలి ఏడాది (2024–25) పది వేల మంది వరకు జనాభా ఉన్నచోట రూ.50 లక్షలు, పది వేల నుంచి 50 వేల మంది వరకు ఉన్నచోట రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల మంది వరకు ఉన్నచోట రూ.65 లక్షలు, ఐదు లక్షలకు పైబడి ఉన్నచోట రూ.85 లక్షలుగా లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. లైసెన్స్ ఫీజు రెండో ఏడాది (2025–26) పది శాతం పెంచి వసూలు చేస్తామని చెప్పారు. కానీ వాస్తవంగా తొలి, రెండో ఏడాది ఎక్సైజ్ ట్యాక్స్‌ను జనంతో సంబంధం లేకుండా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంచుమించు ప్రతి దుకాణానికి తొలి ఏడాది రూ.65 లక్షలుగా, రెండో ఏడాది రూ.71.50 లక్షలుగా నిర్ణయించడం గమనార్హం.

పట్టణమైనా... పల్లె అయినా ఒకటే

కొత్త మద్యం విధానంలో దుకాణాలకు నిర్ణయించిన ట్యాక్స్ ఎక్కడైనా ఒకటే. అమలాపురం మున్సిపాలిటీలో భారీగా అమ్మకాలు జరిగే బైపాస్ రోడ్డులోనైనా.. ఉప్పలగుప్తంలో సముద్ర తీర ప్రాంతమైన ఎస్.యానాంలో దుకాణమైన ఒకటే ట్యాక్స్. అమ్మకాలతో సంబంధం లేకుండా ధర నిర్ణయించారు. అమలాపురం పట్టణం, మండల పరిధిలోని తొమ్మిది దుకాణాలకు ఇదే ట్యాక్స్ నిర్ణయించారు. ఇంత పెద్ద మొత్తంలో ట్యాక్స్ కట్టడంతోపాటు దుకాణాల అద్దె, సిబ్బంది జీతభత్యాలు, పెట్టుబడుల కోసం చేసే అప్పులపై వడ్డీలు, ఎక్సైజ్ అధికారులు, స్థానిక నాయకుల మామూళ్లు ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో దుకాణంపై తొలి ఏడాది కనీసం రూ.90 లక్షల వరకు ఆదాయం తీయాల్సి ఉంది. అంటే రోజుకు కనీసం రూ.25 వేల వరకు లాభం వస్తే పెట్టిన పెట్టుబడులు వచ్చినట్టు లెక్క. దుకాణాల మీద ఇంత ఆదాయం వస్తుందా? అంటే వస్తుందని చెబుతున్నారు పాత మద్యం సిండికేటుదారులు. మద్యం షాపుల పరిధిలో బెల్ట్ షాపులు, దుకాణాల వద్ద లూజు అమ్మకాలు, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసినట్టుగా ఎమ్మార్పీకి అదనంగా బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 చేసి అమ్మకాలు చేసుకో వచ్చని వారు లెక్కలు వేసుకుంటున్నారు. ఆ ధైర్యంతో దుకాణాలకు ధరావత్తు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం సైతం ఎమ్మార్పీ, బెల్టు షాపుల విషయంలో కఠినంగా ఉంటామని పైకి చెబుతున్నా ఆదాయం కోసం చూసీచూడనట్టు వదిలేస్తోందని మద్యం వ్యాపారులు నమ్మకంతో ఉన్నారు. విచ్చలవిడిగా అమ్మకాలు పెంచి మద్యం ప్రియులతో ఫుల్‌గా తాగించేందుకు సిద్ధమవుతోంది. ఎలాగూ ధరలు తగ్గిస్తామని చెబుతున్నందున మద్యం వినియోగం పెరుగుతోంది.

అనధికార ఆక్వా సాగుపై ఆరా
వర్ర భూముల్లో అధికారుల పరిశీలన



నక్కా రామేశ్వరంలో అనధికార చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు నక్కా రామేశ్వరంలోని వంతెనకు ఆనుకుని అనధికారిక ఆక్వా చెరువులను రెవెన్యూ, మత్స్య, సర్వే అధికారుల బృందం గురువారం పరిశీలించింది. గత నెల 29న 'సాక్షి' దినపత్రికలో గ'లీజు' ఒప్పందం శీర్షికన వచ్చిన కథనంపై తహసీల్దార్ నరసింహారావు స్పందించారు. అనధికార చెరువులపై నివేదిక ఇవ్వాలని ఎఫ్‌డీవో అశ్విని, వీఆర్వో సతీష్‌ను ఆదేశించారు. దీంతో ఎఫ్‌డీఓ అశ్విని అనధికార చెరువులను పరిశీలించి లీజుదారులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా సాగు ఎలా చేస్తారని వారిని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న పట్టాదారులు ఆక్వా సాగు చేసుకునేందుకు తమతో ఒప్పందం చేసుకున్నారని లీజుదారులు తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలు చాలా కాలంగా రెన్యువల్ కాలేదని, పట్టాల రెన్యువల్ కోసం రెవెన్యూ శాఖకు పంపామని స్థానిక పెద్దలు తెలిపారు. ఏక్‌సాల్ లీజు పట్టాలు రెండు రోజుల్లో తన ముందు ఉంచాలని మత్స్యకారులకు ఎఫ్‌డీఓ సూచించారు. సరైన పట్టాలు లేకపోతే అనధికారికంగా సాగు చేస్తున్న చెరువులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనధికారిక చెరువులపై చర్యలు తీసుకోకుండా లీజుదారులకు రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారని ఫిర్యాదుదారుడు అభ్యంతరం తెలిపారు. గత పదేళ్లుగా ఏక్‌సాల్ లీజ్ పట్టాలు రెన్యువల్ కాకపోయినా అధికారులు ఎందుకు అనధికారిక సాగుకు సహకరిస్తున్నారో చెప్పాలని మండిపడ్డారు. దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట వీఆర్వో సతీష్, వీఎఫ్ఏ నరసింహ ఉన్నారు.

రోడ్డు విస్తరణ అభ్యంతరాలు పరిష్కరించాలి



జాతీయ రహదారి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జాతీయ రహదారి 216 విస్తరణకు సంబంధించి పాశర్లపూడి, మామిడికుదురులలో ఉన్న అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి విస్తరణ అంశంలో పెండింగ్ సమస్యలు, అభ్యంతరాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకిగా ఉన్న నిర్మాణాల విలువ, తదితర అంశాలను పునః పరిశీలించి తాజాగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గెద్దాడలో రహదారి విస్తరణ పనులకు సంబంధించి బరియల్ గ్రౌండ్ స్థానే వేరే స్థలాన్ని కేటాయించి బరియల్ గ్రౌండ్ నిర్మించాలని ఆదేశించారు. శివకోడులో చాంబర్ రోడ్డు నిర్మాణంతో జల వనరుల శాఖ లాకు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, వీటిని మరోసారి స్వయంగా పరిశీలిస్తామని ఆయన అన్నారు. ఈ నెల 5న ఆర్‌అండ్‌బీ కార్యదర్శి సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కె.మాధవి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివేదిక ఇవ్వండి

సీఎం చంద్రబాబు ఆగస్టు 23న కొత్తపేట మండలం వానపల్లి గ్రామసభలో ఇచ్చిన హామీలపై పరిష్కార మార్గాలు పూర్తి స్థాయిలో చూపాలని జేసీ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, సీఎం ఇచ్చిన హామీలపై శాఖల వారీగా సమీక్షించారు. వీటి అమలుకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై అవగాహన ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: రెవెన్యూ అంశాలపై పూర్తి అవగాహనతో అధికారులు ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. అదనపు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ ప్రభాకరరెడ్డి అమరావతి నుంచి గురువారం 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్, నీటి వినియోగదారుల సంఘాల ఆధీనంలో ఉన్న భూములు, జిల్లా స్థాయి మానిటరింగ్ ఆడిట్ కమిటీ తనిఖీలు, లోకాయుక్త కేసులు, సమాచార హక్కు చట్టం అమలు తీరు, కోర్టు కేసులు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు అమలాపురం కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొని అనంతరం అధికారులతో మాట్లాడారు. భూ పరిపాలన అంశాలను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టులు రెండు పెండింగ్‌లో ఉన్నాయని, పీరియాడికల్ రిపోర్టులను సీసీఎల్ఏ కార్యాలయానికి సకాలంలో పంపాలన్నారు. ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారించి, రిజాయిండర్లు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ వి.మదన్‌మోహనరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఏఓ కె.విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు చినబాబు, రవికిరణ్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణను ఆపాలి



కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే అంశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అమలాపురం కలెక్టరేట్ వద్ద కార్మిక, ప్రజా, విద్యార్థి, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా పూర్వపు అధ్యక్షుడు కె.సత్తిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఐఎన్టీయూసీ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీరావేశంతో జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు ఇప్పుడు ఉక్కు పరిశ్రమలోని 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే, ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు బలవంతంగా ట్రాన్స్‌ఫర్స్ చేస్తుంటే మౌనం ఎందుకు వహిస్తున్నారో ఆంధ్రా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 32 మంది ప్రాణ త్యాగాలతో, 67 మంది ఎంపీల రాజీనామాలతో, 30 గ్రామాల రైతుల 32 వేల ఎకరాల భూముల త్యాగంతో సాధించుకున్నామని గుర్తు చేశారు. ఈ దీక్ష శిబిరంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారు.

నాస్‌కు సన్నద్ధం

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- జిల్లాలో 104 పాఠశాలల ఎంపిక



రాయవరం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పరిశీలించేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పేరుతో పరీక్షలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది.. సమున్నత లక్ష్యంతో ముందుకు సాగేలా విద్యా వ్యవస్థలో నిరంతరం కసరత్తు జరుగుతోంది. విద్యార్థి తరగతి వారీగా అభ్యసన సామర్థ్యాలు సాధించేలా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాల స్థాయి ఎలా ఉందనే విషయాన్ని తేటతెల్లం చేసేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఉపకరిస్తుంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి నాస్ సర్వే నిర్వహిస్తుండగా, చివరగా 2021లో నిర్వహించారు. తిరిగి ఈ ఏడాది నిర్వహించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా, ఎస్‌సీఈఆర్‌టీలు చర్యలు చేపడుతున్నాయి. ప్రస్తుతం నిర్వహించే నాస్ సర్వేకు ముందుగా గతేడాది నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పేరుతో మండల స్థాయిలో సర్వే చేపట్టారు. దీని ఆధారంగా మన విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేస్తున్నారు.

సర్వే చేపడతారిలా..

గత విద్యా సంవత్సరంలో నవంబర్ 3న నిర్వహించిన సీస్ పరీక్షను జిల్లాలో 976 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) పేరుతో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పరీక్ష ద్వారా మదింపు చేశారు. ఇప్పుడు ఆ మాదిరిగానే 3, 6, 9 తరగతులకు జిల్లాలో ఎంపిక చేసిన 104 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నవంబరు 19న సర్వే చేపట్టనున్నారు. మూడో తరగతిలో 37, ఆరో తరగతిలో 30 పాఠశాలలు, 9వ తరగతిలో 37 పాఠశాలల్లో నాస్ పరీక్షను నిర్వహించనున్నారు. అయితే ఏ ఏ పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తారనేది స్పష్టం కావాల్సి ఉంది. నాస్ పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పరీక్ష నిర్వహించేందుకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్ఐ)లను ఎంపిక చేయనున్నారు. డైట్, బీఎడ్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యాభ్యాసం సాగిస్తున్న ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యవేక్షకులు (ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు)గా నియమించనున్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపికకు కసరత్తు

నాస్ సర్వేలో భాగంగా క్షేత్ర స్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఆయా మండలాలకు ఎంత మంది ఎఫ్ఐలు అవసరమన్నది విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడు ఎఫ్ఐలుగా ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను నియమించి, వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

నాస్ సర్వే నిమిత్తం నిర్వహించే పరీక్షను పూర్తిగా వీరి పర్యవేక్షణలోనే నిర్వహిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, ఎంపిక చేసిన ఇద్దరు మాస్టర్ ట్రైనీలు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా మండల విద్యాశాఖాధికారులు 1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. నాస్ పరీక్షకు ముందుగా విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంది. గతంలో సర్వేలో భాగంగా 3, 5, 8 తరగతులకు పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు భాష, గణితం, పరిసరాల విజ్ఞానంపై పరీక్ష నిర్వహించే అవకాశముంది.

సీస్ మాదిరిగానే..



గతేడాది నిర్వహించిన సీస్ పరీక్ష మాదిరిగానే ఈ ఏడాది కూడా నాస్ పరీక్ష నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీలు పనిచేస్తాయి. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్ఐ) నియామకానికి ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

– జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

విద్యా స్థాయి తెలుసుకునేందుకు..



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల స్థాయిని కచ్చితంగా అంచనా వేసేందుకు నాస్ సర్వే ఉపకరిస్తుంది. గతంలో సీస్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాం. సర్వే ఫలితాలను బట్టి తగిన బోధనాభ్యసన ప్రణాళికలను ఎస్‌సీఈఆర్‌టీ రూపొందిస్తోంది. సర్వేను జిల్లా కమిటీ పర్యవేక్షిస్తుంది.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

క్లుప్తంగా

డీజిల్ తరలిస్తున్న వ్యాన్ సీజ్



సీజ్ చేసిన వ్యాన్ వద్ద అధికారులు, కోరంగి పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వ్యాన్‌ను కోరంగి పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు ఎంఎస్‌ఓ లక్ష్మీ ప్రసన్న వీఆర్వోలతో కలిసి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. యానాంలోని ఒక పెట్రోల్ బంకు నుంచి 2400 లీటర్ల డీజిల్‌ను కొనుగోలు చేసి జగ్గంపేట తరలిస్తుండగా వ్యాన్ సీజ్ చేశారు. యానాంలో లీటర్ డీజిల్ రూ.84.79కు కొనుగోలు చేసి, ఆంధ్రాలో రూ.97కు పైగా విక్రయిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో తాళ్లరేవు, కోరంగి, పటవల వీఆర్వోలు సమనాసి వీరబాబు, ఎల్.శ్రీను, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదరించే వారు లేక ఆత్మహత్యాయత్నం



స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుకు నాగరత్నాన్ని అప్పగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: జీవిత చరమాంకంలో ఒంటరి జీవులకు ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో చివరికి చావుకు దగ్గర కావాలని కోరుకుంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నం (75)ను అనారోగ్యం ఒక వైపు, అయినవారు చూడకపోవడం మరోవైపు కుంగదీసింది. కుటుంబ సభ్యుల ఈసడింపులను తట్టుకోలేని ఆమె గురువారం ఉదయం రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అక్కడ చిరు వ్యాపారులు ఆమెను నిలువరించి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదృష్టవశాత్తు ఆమె బతికి బయటపడింది. పోలీసులు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుతో మాట్లాడి ఆమె దుస్థితిని వివరించి ఆశ్రమంలో చేర్పించారు. ఇక్కడ తనలాంటి పది మందిని చూసి, బతకాలని ఆశ కలిగిందని నాగరత్నం తెలిపారు.

బంధువులు వస్తే అప్పగిస్తాం

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సుమారు 30 మందికి ఆశ్రయం కల్పిస్తుండగా, రోజూ రెండు పూటలా కలిపి 300 భోజనాలు అల్పాహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. అలాగే పుష్కరాల రేవులోనూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోజూ 500 మందికి మొబైల్ ఉచిత అన్నదాన సేవలను అందిస్తున్నామన్నారు. నాగరత్నం బంధువులు, సంబంధించిన వారు ఎవరు వచ్చినా పోలీసులు ద్వారా వారికి తిరిగి అప్పగిస్తామని అన్నారు.

వాహనం సీజ్

తుని రూరల్: మాంసపు వ్యర్థాల లోడు వాహనాన్ని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీజ్ చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. గురువారం విశాఖపట్నం నుంచి కాకినాడ జిల్లా ఇర్రిపాకకు వెళుతున్న వ్యర్థాల లోడు వాహనాన్ని ఎఫ్‌డీఓ సీజ్ చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు



కాకినాడ దేవాలయం వీధిలో గాయత్రి దేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారు



స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



రాజరాజేశ్వరి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

అపురూపమమ్మ

- ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు శ్రీకారం
- తొలిరోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలిరోజు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాడవాడలా అమ్మవారి మంటపాలను ఏర్పాటు చేయగా, ప్రముఖ దేవాలయాల వద్ద ఉత్సవాలు అంబరాన్నంటాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అన్నవరం, తలుపులమ్మ లోవ, అమలాపురం తదితర చోట్ల ప్రముఖ ఆలయాలతో పాటు వివిధ ఉత్సవ మంటపాల్లో వేడుకలు జరిగాయి.



అన్నవరంలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



బాలాత్రిపుర సుందరిగా లోవ తలుపులమ్మ తల్లి



బాలాత్రిపుర సుందరిగా అన్నవరం వనదుర్గమ్మ



కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలో అన్నపూర్ణ అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విద్యుత్ దీపాలంకరణ



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో అన్నపూర్ణాదేవి



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో కిక్కిరిసిన భక్తులు



కోటనందూరు మండలం కాకరాపల్లిలో కలశయాత్ర చేస్తున్న మహిళలు

రేషన్ బియ్యం నిల్వలపై విజిలెన్స్ దాడి



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఉన్న టాటా ఏస్ వాహనం, నిందితులు

రాయవరం: మండలంలోని పసలపూడిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లయిస్ డీటీ ఆలీషా కథనం ప్రకారం.. పసలపూడిలో జి.వెంకన్న అనే వ్యక్తి షెడ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారంపై రెవెన్యూ అధికారులతో కలసి విజిలెన్స్ అధికారులు టి.నాగ వెంకటరాజు, కె.విజయకుమార్, సీహెచ్ కిశోర్‌కుమార్ తనిఖీ చేశారు. ఇక్కడ షెడ్‌లో ఉంచిన టాటా ఏస్ వాహనంలో 65 బ్యాగుల్లో నిల్వ ఉంచిన సుమారు 3,185 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని రామచంద్రపురం పట్టణానికి చెందిన నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, గుమాస్తా రావాడ వీరబాబు సహాయంతో వివిధ ప్రాంతాల్లోని వ్యక్తుల నుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి కిలో రూ.23కు జి.మామిడాడ పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం విలువ రూ.5,46,419 ఉంటుందని అన్నారు. రేషన్ బియ్యంతో పాటుగా వేయింగ్ మెషీన్‌ను పౌర సరఫరాల అధికారులు సీజ్ చేసి, 6–ఏ కింద కేసు నమోదు చేశారు. బియ్యాన్ని నిల్వ చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసుల నమోదుకు పౌర సరఫరాల డీటీ ఆలీషా రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మరో విద్యార్థినిని శిక్షించిన ఫిర్యాదుల మేరకు హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) మోసుగంటి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు గదులు తుడవడానికి వస్తే చాక్లెట్లు ఇస్తానని చెప్పడంతో విద్యార్థినులు వెళ్లి తుడిచారు. అనంతరం విద్యార్థినులు సదరు మాస్టార్‌ను చాక్లెట్లు అడిగితే అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మరో విద్యార్థినిని శిక్షించాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం డీవైఈఓ నారాయణ, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తప్పు చేసినట్లు తేలింది. దీంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు అతన్ని సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాకుండా పిడింగొయ్యికి చెందిన ఓ టీడీపీ నేత మధ్యవర్తిత్వం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సుజాత (ఫైల్)

సఖినేటిపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సుజాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఉయ్యూరువారి మెరక గ్రామంలోని వెలంకాయల కోడు కాలువగట్టు ప్రాంతంలో ఆమె నివాసం ఉంటున్నారు. మంగళవారం స్కూల్‌కు వెళ్లే క్రమంలో కేశవదాసుపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు కాకినాడ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

చాకులతో నలుగురిపై దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- నిడదవోలు శివారు లింగంపల్లిలో ఘటన



నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కాకర్ల శ్రీను

నిడదవోలు రూరల్/ నిడదవోలు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని లింగంపల్లిలో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ భవానీ మాల ధరించిన భక్తులు భజనలు, చిన్నారులు కోలాటం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన గుంటు సునీల్ బైక్‌పై ఇంటికి వెళ్లేందుకు అటువైపు వచ్చాడు. తన బైక్ వెళ్లేందుకు దారి ఇవ్వాలని సునీల్ కమిటీ సభ్యులను అడిగే సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో సునీల్‌తో పాటు అతని తమ్ముడు అనిల్ కలసి చాకులతో వచ్చి కమిటీ సభ్యుడైన కాకర్ల శ్రీను, అతని కుటుంబ సభ్యులు కాకర్ల పుట్టయ్య, కాకర్ల ప్రవీణ్, మీసాల శ్రీనులపై దాడి చేశాడు. దీంతో మెడ వద్ద తీవ్ర గాయాలైన కాకర్ల శ్రీనును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అత్యవసర వైద్య సేవల నిమిత్తం తరలించారు. గాయాలైన ప్రవీణ్, పుట్టయ్య, మీసాల శ్రీనులకు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సై టి.శోభన్ కుమార్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

కాకినాడ క్రైం: నగరంలోని రామారావు పేటలో పేకాట శిబిరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. ఇందులో ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. ఎస్పీ విక్రాంత్ ఆదేశాల మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రముఖ న్యాయవాదితో సహా టీడీపీకి చెందిన పలువురు చోటా నేతలు దాడుల్లో పట్టుబడినట్లు తెలుస్తోంది. 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20 లక్షల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడు బ్యాంక్ మేనేజర్‌గా గుర్తింపు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట వైద్యనగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడు రాయుడుపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజరు రొయ్యి రాంబాబు (36)గా సర్పవరం పోలీసులు గుర్తించారు. వైద్యనగర్‌లో నివసిస్తున్న రాంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు స్నాక్స్ కావాలని అడగడంతో ఇంటి నుంచి రమణయ్యపేట మార్కెట్ వద్దకు బుధవారం రాత్రి వెళ్లి వాటిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయం తగలడం వల్ల తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.